కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :131 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 08-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి: పొన్నం



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని, తాతా మధు వ్యాఖ్యల పట్ల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి తాను సంఘీభావం ప్రకటించానన్నారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు అని, రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు.ఒక అట్టడుగు వర్గాల బిడ్డ, దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు రాకుండా ఉంటారని, కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సమాధానం చెప్పాలన్నారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కెసిఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని సూచించారు.

## తాతా మధుపై చర్యలు తీసుకోవాల్సిందే: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 7: బీజేపీ ఎమ్మెల్యేల ఆందోళనలతో వాయిదా పడిన తెలంగాణ శాసనసభ తిరిగి మొదలైంది. ఈ సందర్భంగా స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దుర్భాషలాడారని మండిపడ్డారు. తాతా మధు వ్యాఖ్యలపై అందరం మనస్తాపం చెందామని.. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే అని తెలిపారు. స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత బీజేపీకి లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ చైర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని.. స్పీకర్‌ను దూషించడం దుర్మార్గమని మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడంపై బీజేపీ వైఖరి చెప్పాలని.. ఆయనకు జరిగిన అవమానంపై ఆ పార్టీ మాట్లాడాలని డిమాండ్ చేశారు.సభ్యులు సభా సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఈ అంశంలో బీజేపీ సహకరించాలన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగాన్ని బీజేపీ సభ్యులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గందరగోళం నెలకొంది. సభలో బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యులు సభను అడ్డుకోవడం సరికాదని.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

### స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల్ విజయలక్ష్మి

స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా గద్వాల్ విజయలక్ష్మి సోమవారం ప్రజాభవన్ లో పదవీ బాధ్యతలు స్వీకరించారు.ప్రజా భవన్ కు విచ్చేసిన గద్వాల్ విజయలక్ష్మికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## హిందుత్వం ఒక జీవన విధానం: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

హిందుత్వం అనేది ఒక నిర్దిష్ట మతం కాదని, అది భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే విస్తృత జీవన విధానమని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. లండన్‌లో జరిగిన 'సెలబ్రేషన్ ఆఫ్ వన్ నెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విదేశాల్లో స్థిరపడిన హిందువులు తాము నివసిస్తున్న కర్మభూమికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ దేశాల అభివృద్ధికి విధేయతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మానవుడికి జన్మభూమి నుంచి విలువలు లభిస్తే, వాటిని అమలుపరిచేది కర్మభూమిలోనే అని భాగవత్ వ్యాఖ్యానించారు.విదేశాలలో నివసించే హిందువులు తాము నివసిస్తున్న దేశ సంక్షేమానికి, పురోగతికి కట్టుబడి ఉండాలి. కర్మభూమికి ద్రోహం చేయడం హిందూ తత్వానికి విరుద్ధం.ఒకవేళ భారత్, బ్రిటన్ ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలు తలెత్తితే, బ్రిటిష్ హిందువులు తమ కర్మభూమి అయిన బ్రిటన్ వైపే నిలబడటం సహజమని, నిజమైన హిందూ జీవన విధానం దీనినే సమర్థిస్తుందని పేర్కొన్నారు. హిందూ భావనలో నాస్తికత్వం నుంచి బహుదైవారాధన వరకు అన్ని రకాల ఆలోచనలకు స్థానం ఉంది. ఇతరులను మతం మార్చాల్సిన అవసరం హిందుత్వంలో లేదు.హిందూ రాష్ట్రం అంటే కేవలం ఒక పాలనా వ్యవస్థ మాత్రమే కాదని, "భిన్నత్వం సహజం – ఏకత్వమే సత్యం" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించడమే దాని ముఖ్య ఉ



ద్దేశమని ఆయన వివరించారు. యువత సాధికారతపై మాట్లాడుతూ, ప్రస్తుత తరం యువతలో మెరుగైన సమాజాన్ని నిర్మించాలనే నిజాయతీ, తపన ఎక్కువగా ఉన్నాయని భాగవత్ ప్రశంసించారు. పెద్దలు యువతకు ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించాలి తప్ప, వారు ఏ మార్గంలో వెళ్లాలో రుద్దకూడదని సూచించారు. జనరేషన్ జెడ్, ఆల్ఫా తరాల యువత ప్రశ్నించే తత్వాన్ని, తార్కిక ఆలోచనలను కలిగి ఉన్నారని, వారే ప్రపంచంలో సానుకూల మార్పు తీసుకురాగలరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బీజేపీ,బీఆర్ఎస్ ఒక్కటే.. నో డౌట్

హైదరాబాద్,బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే.. నో డౌట్ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై అసెంబ్లీ చిట్‌చాట్‌లో మాట్లాడిన మంత్రి.. బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన, బీఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.కేసీఆర్, కేటీఆర్‌లే ఆద్యులు: దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను ఉద్దేశించి పచ్చిగా మాట్లాడటం క్షమించరాని నేరమని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే సీరియస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను, దళిత ఎమ్మెల్యే సంపత్ ఎలాంటి తప్పు చేయకపోయినా తమ సభ్యత్వాన్ని రద్దు చేశారని గుర్తుచేశారు. స్పీకర్‌ను అంత ఘోరంగా తిట్టిన వారిని ఉపేక్షిస్తే ఆ పదవికి ఇచ్చే గౌరవం ఏముంటుందని ప్రశ్నించారు. రాజకీయాలో తిట్లకు, అభ్యంతరకర భాషకు ఆద్యుడు కేసీఆరేనని అన్నారు. కేటీఆర్ భాష కూడా పరిధి దాటిపోతోందని విమర్శించారు. సీఎం, మంత్రులను కుక్కలతో పోల్చడం వారి సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఈ భాషపై సభలో చర్చ పెట్టాలని స్పీకర్‌ను కోరనున్నట్లు తెలిపారు.బీజేపీ, బీఆర్ఎస్



ఒక్కటే: ప్రజాసమస్యలపై చర్చించడానికే సభను ఏర్పాటు చేశామని.. బయట అంగీలు విప్పి నిరసన తెలపడం కాదని అన్నార. ధైర్యముంటే సభకి వచ్చి మాట్లాడాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదని మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## స్పీకర్ ను అవమానించిన సభ్యుడిపై బిఆర్ఎస్ చర్యలు తీసుకోవాలి : రేవంత్

హైదరాబాద్: వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూమిలోని సారం నుంచి మొదలు పెట్టి.. నీరు, విత్తనం, పెట్టుబడి, పంట,గిట్టుబాటు ధర..అన్ని అంశాలు కూలంకషంగా సారంపల్లి మల్లారెడ్డి చెప్పేవారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన రవీంద్రభారతిలో ప్రముఖ రైతు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ప్రసంగించారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని, సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిశానని తెలియజేశారు. కానీ ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని, రైతు సమస్యలపై అవగాహన ఉన్న గొప్ప రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అని కొనియాడారు.కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని, దున్నేవాడిదే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని ప్రశంసించారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానం అని..అసైన్డ్, పోడు పట్టాలు దక్కాయంటే.. పోరాటం కమ్యూనిస్టులదని..పరిష్కారం కాంగ్రెస్ ది అని రేవంత్ పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల కారణంగా కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని, పదేళ్లలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాల వల్ల 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ పై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టుల సహకారంతో కాంగ్రెస్ చేసిన పోరాటాల వల్లే మోడీ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారని విమర్శించారు.సర్ ను ఆయుధంగా చేసుకుని వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని, తెలంగాణలో కోటి ఓట్లను, పేదలు, గిరిజనుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని అన్నారు. కొడంగల్ నుంచి వలస వెళ్లిన వేల మందిని పేదల ఓట్లను ఇసి తొలగిస్తోందని, 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి..బిజెపి వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారని, వ్యతిరేకులను గుర్తించేందుకు బిజెపి ప్రత్యేకంగా ఏజెన్సీలను పెట్టుకుందని ధ్వజమెత్తారు. తెలంగాణలో కోటి ఓట్లను తొలగిస్తున్నా బిఆర్ఎస్ నోరెత్తడం లేదని, 33 శాతం ఓట్లు తొలగిస్తున్నామంటున్నా బిఆర్ఎస్ మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ్టి ఓట్లతోనే 2029 మోడీ ఓటమికి పునాది పడుతుందని, ఓట్ల తొలగింపుపై అంతా అప్రమత్తంగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు.

### మోడీ సర్కార్ పై పోరాటం చేయాలి: రేవంత్

హైదరాబాద్: వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూమిలోని సారం నుంచి మొదలు పెట్టి.. నీరు, విత్తనం, పెట్టుబడి, పంట,గిట్టుబాటు ధర..అన్ని అంశాలు కూలంకషంగా సారంపల్లి మల్లారెడ్డి చెప్పేవారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన రవీంద్రభారతిలో ప్రముఖ రైతు సారంపల్లి మల్లారెడ్డి



సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ప్రసంగించారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని, సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిశానని తెలియజేశారు. కానీ ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని, రైతు సమస్యలపై అవగాహన ఉన్న గొప్ప రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అని కొనియాడారు.కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని, దున్నేవాడిదే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని ప్రశంసించారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానం అని..అసైన్డ్, పోడు పట్టాలు దక్కాయంటే.. పోరాటం కమ్యూనిస్టులదని..పరిష్కారం కాంగ్రెస్ ది అని రేవంత్ పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల కారణంగా కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని, పదేళ్లలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాల వల్ల 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ పై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టుల సహకారంతో కాంగ్రెస్ చేసిన పోరాటాల వల్లే మోడీ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారని విమర్శించారు. సర్ ను ఆయుధంగా చేసుకుని వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని, తెలంగాణలో కోటి ఓట్లను, పేదలు, గిరిజనుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని అన్నారు. కొడంగల్ నుంచి వలస వెళ్లిన వేల మందిని పేదల ఓట్లను ఇసి తొలగిస్తోందని, 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి..బిజెపి వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారని, వ్యతిరేకులను గుర్తించేందుకు బిజెపి ప్రత్యేకంగా ఏజెన్సీలను పెట్టుకుందని ధ్వజమెత్తారు. తెలంగాణలో కోటి ఓట్లను తొలగిస్తున్నా బిఆర్ఎన్ నోరెత్తడం లేదని, 33 శాతం ఓట్లు తొలగిస్తున్నామంటున్నా బిఆర్ఎస్ మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ్టి ఓట్లతోనే 2029 మోడీ ఓటమికి పునాది పడుతుందని, ఓట్ల తొలగింపుపై అంతా అప్రమత్తంగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు.

## ఉమ్మడి రాష్ట్రంలో భాషను దిగజార్చింది కెసిఆరే: ఉత్తమ్



హైదరాబాద్: మాజీ సిఎం కెసిఆర్ గతంలో బూతులు మాట్లాడినప్పుడు హీరోలా ఫీలయ్యారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బూతుల విషయంలో కెసిఆర్ దే తప్పు అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇప్పుడు వేరే వాళ్లు మాట్లాడితే అసెంబ్లీకి రాను అంటున్నారని, తాము ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు వింటున్నామని అనడం దుర్మార్గమని విమర్శించారు. కెసిఆర్, బిఆర్ఎస్ మాట్లాడే విషయాల్లో హిపోక్రసీ ఎక్కువగా ఉందని, ఇప్పుడు అదే భాషను కెసిఆర్ పై ఉపయోగిస్తే నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో భాషను దిగజార్చింది కెసిఆరేనని, కెసిఆర్ మాట్లాడిన భాష వల్లే తెలంగాణ భాషకు చెడ్డ పేరు వచ్చిందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. ఇరిగేషన్ విషయంలో కెసిఆర్ తప్పులే ప్రస్తుతం సమస్యలకు కారణమని, కెసిఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుతారని, కెసిఆర్ ఫామ్ హౌస్ లో పడుకుంటేనే మంచిదని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహరించిన తీరు దుర్మార్గం!



బడంగ్ పేట్ : ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు శాసనసభకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం అత్యంత దారుణమని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీకి హాజరయ్యేందుకు వచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను గేటు వద్దే అడ్డుకోవడమే కాకుండా, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడం అత్యంత అమానుషమని ఆమె ధ్వజమెత్తారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలని కూడా చూడకుండా పోలీసులు తోసేయడం, అడ్డుకోవడం, దురుసుగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే అవమానాకరమన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రతపై ప్రజలు ఆందోళన చెందుతున్న సమయంలో, ఏకంగా శాసనసభకు వెళ్లే మహిళా ప్రజాప్రతినిధులకే భద్రత లేకుండా పోవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. "ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకగా నిలిచే ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం ఏ విధమైన ప్రజాస్వామ్యం?" అని ఆమె ప్రశ్నించారు.

### అసెంబ్లీకి చీర కట్టుకుని వస్తే కూడా అభ్యంతరమా?

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సునీతా లక్ష్మారెడ్డి చీర ధరించి అసెంబ్లీకి రావడంపై కూడా పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని



## సంపాదకీయం

మంగళవారం 08-09-2026

## జీడీపీ పెరుగుతోంది... కానీ...

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖ1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదు.డబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

# పాదయాత్రల కౌంటర్...



విజయవాడ,ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు.2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది.ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు.జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

# కుటుంబ రాజకీయాలతో ఎన్నాళ్లీ కుంటినడక?

హైదరాబాద్,'కొండా సురేఖను మంత్రివర్గంనుండి తొలగిస్తారా లేదా అంత సాహసం చెయ్యలేరా? ఏదో మధ్యస్థంగా ఒక ఏర్పాటు ఉంటుందా? వెనుకబడిన తరగతుల మహిళా నాయకురాలిని మంత్రివర్గంలోనుండి తొలగిస్తే ఇంకేమన్నా ఉందా కాంగ్రెస్ కొంప తగులబడ్డట్టే. ప్రభుత్వం కుప్ప కూలిపోతుంది' .. వంటి బోలెడన్ని విశ్లేషణలు ఓ వారంపాటు సాగనిచ్చి ఆమెను మంత్రివర్గం నుండి తొలగించడానికి కాంగ్రెస్ అధిష్ఠానవర్గం పచ్చజెండా ఊపేసింది. సురేఖను వెంటనే మంత్రివర్గం నుండి తొలగించకుండా ఈ కాలయాపన ఏమిటి, ప్రభుత్వం, ముఖ్యమంత్రి బలహీనపడిపోరా అని ఆక్రోశం వెలిబుచ్చిన కాంగ్రెస్ వీరవిధేయులు కూడా లేకపోలేదు. కానీ, అంతా పద్ధతి ప్రకారం జరిగింది. సురేఖ వ్యవహారం, దాంతోబాటు మరో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యల విషయమూ పార్టీ క్రమశిక్షణ సంఘం విచారించి పిసిసి అధ్యక్షుడికి నివేదిక అందిస్తే ఆయన దాన్ని పార్టీ అధిష్టానవర్గానికి పంపారు. ఆ తరువాతే పార్టీ అధిష్ఠానవర్గం సురేఖను, చిన్నారెడ్డిని పదవుల నుండి తొలగించింది. వారిని పార్టీ సభ్యులుగా మాత్రం కొనసాగించింది. అధిష్ఠానవర్గం నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలుసుకుని సురేఖను మంత్రివర్గంనుండి తొలగిస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేశారు. ఆయన దాన్ని అంగీకరించి ఆమెను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.ఇక్కడితో కథ సుఖాంతం అయినట్టేనా, వచ్చే రెండేళ్ళపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒడుదుడుకులూ లేకుండా సాగుతుందా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవికి ఏ ఇబ్బంది ఉండదా అన్న విషయాల మీద ప్రస్తుతం చర్చలు, ఊహాగానాలూ జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ చిన్నారెడ్డి గురించి మాట్లాడుకోవాలి. ఒక బిసి మహిళ మీద మాత్రమే వేటు వేసారనే మాట రాకుండా చిన్నారెడ్డిని కూడా పదవి నుండి తొలగించారు కానీ, మామూలుగా అయితే చిన్నారెడ్డి రాజకీయాల్లో సాధుజీవి. ఎవరికీ ఏ హానీ తలపెట్టని వ్యక్తి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి అత్యంత విధేయుడు. ఆయన 1989 నుండి 2009 దాకా నాలుగుసార్లు కాంగ్రెస్ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు, మంత్రిగా పనిచేసారు. ఎక్కడా ఆయన వివాదాస్పదుడిగా ముద్ర వేసుకోలేదు. ఇప్పుడు కూడా ఆయన చాలా హుందాగానే మౌనం వహించి ఉన్నారు. అయితే బిసి మహిళను మంత్రివర్గం నుండి తొలగించారన్న అపవాదుకు విరుగుడుగా ఒకరికి కేబినెట్ హోదాతో సహా ముగ్గురు బిసి మహిళలకు పదవులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నిర్ణయం స్వయంగా ముఖ్యమంత్రిదో, అధిష్ఠానవర్గం నిర్ణయమో కానీ వ్యూహాత్మకం అనిపించింది.కొండా సురేఖ విషయానికి వస్తే ఆమె, ఆమె కుటుంబం ఒక పెద్ద వివాదాల పుట్ట. చిన్నారెడ్డిలాగా ఆమె కూడా సీనియర్ శాసనసభ్యురాలే. ఆయనకంటే ఓ పదేళ్ళ తరువాత చట్టసభలోకి 1999లో ప్రవేశించి అయిదుసార్లు శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. అయితే సురేఖ కాంగ్రెస్ ను, అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యను విమర్శించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మళ్ళీ ఆ పార్టీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డిని విమర్శించి భారత రాష్ట్ర సమితికి వలసపోయారు. అక్కడా ఇమడలేక ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావును విమర్శించి తిరిగి పాతగూడు అయిన కాంగ్రెస్ లోకి చేరుకున్నారు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో సభ్యురాలు అయ్యారు. ఇప్పుడు మళ్ళీ అదే కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారు. 'నేను కానీ, నా కూతురు కానీ కాంగ్రెస్ పార్టీని, హై కమాండ్‌ను విమర్శించలేదు. రేవంత్ రెడ్డిని విమర్శించాం. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను విమర్శించాం. మరో మంత్రి పొంగులేటిని విమర్శించాం అంటున్నారు. వీళ్ళంతా ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడుపుతున్నవారు కాదా? వీళ్ళను విమర్శిస్తే కాంగ్రెస్‌ను విమర్శించినట్టు కాదా అన్నది కాంగ్రెస్ శ్రేణులనుండి వస్తున్న ప్రశ్న. అంతేకాదు, అధిష్ఠానం రేవంత్ రెడ్డి బెదిరింపులకు లొంగిందంటే అది కాంగ్రెస్ ను విమర్శించడం కాదా? పోనీ, ప్రభుత్వం నడుస్తున్న తీరు మీద, ప్రజలకు పరిపాలన అందించే క్రమంలో జరుగుతున్న తప్పుల మీదా విమర్శ చేస్తే అది వేరే విధంగా ఉండేది. దానికి కూడా తన స్వరం వినిపించడానికి సరయిన వేదికలు ఉంటాయి.అదికాకుండా ప్రస్తుతం సురేఖ మీద వేటు పడటానికి కారణం ఏమిటి? ఆమె కుమార్తె సుస్మిత వాచాలత్వం. ఆమె కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యురాలు కూడా కాదు. కాంగ్రెస్ శాసనసభ్యుడిగా పరకాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రేవూరి ప్రకాశ్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో కూడా గెలుస్తారని ముఖ్యమంత్రి బహిరంగ ప్రకటన చెయ్యడం ఆమెకు నచ్చలేదు. అంతే, ముఖ్యమంత్రినే కళ్ళు నెత్తికెక్కాయని తూలనాడే స్థాయికి



వెళ్ళారు. సవాళ్లు విసిరారు. సురేఖ కుమార్తె ఈ విధంగా వ్యవహరించడం ఇదే మొదటిసారి కాదు. కొంతకాలం క్రితం పోలీసుల విధినిర్వహణకు అడ్డుతగిలిన విషయంలో తల్లి క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. ఒక మహిళ విషయంలో ఇలా వ్యవహరిస్తారా అని సురేఖ బర్తరఫ్ ను వ్యతిరేకిస్తూ మాట్లాడేవాళ్ళు ఆమె అత్యంత బాధ్యతారహితంగా మంత్రిస్థాయి కూడా మరిచి అక్కినేని నాగార్జున కుటుంబాన్ని రచ్చకీడ్చే ప్రయత్నంలో సాటి మహిళను కించపరిచినప్పుడు ఈ నోళ్ళన్నీ ఏమయ్యాయి?తన కూతురు మాట్లాడిన మాటలను సమర్థించే క్రమంలో సురేఖ.. కడియం శ్రీహరి కూతురు పార్లమెంట్ సభ్యురాలు అయితే నా కూతురు కనీసం శాసనసభ్యురాలు కావాలనుకోవడం తప్పా అని ఒక వింత వ్యాఖ్య చేసారు. అంటే రాజకీయాలు కుటుంబ వారసత్వంగానే కొనసాగాలా? కొండా కుటుంబంలో సురేఖ మంత్రిగా ఉండాలి, ఆమె భర్త మురళి శాసనమండలి సభ్యుడిగా ఉండాలి (కాంగ్రెస్ పార్టీ మళ్ళీ ఆయనకు శాసనమండలి పదవి ఇవ్వనందుకు ఆయన కినుక వహించి ఉన్నట్టు గతంలో వార్తలు వచ్చాయి). కూతురు వచ్చే ఎన్నికల్లో శాసనసభ్యురాలు కావాలి. ఇలా కుటుంబాలు పదవులు పంచుకోవడం ప్రజాస్వామ్యమా? ఇతర కుటుంబాల్లో, ఇతర పార్టీల్లో కూడా ఈ దుష్ట సంప్రదాయం ఉన్నది. దాన్నీ వ్యతిరేకించాల్సిందే. కానీ, తనమీద ప్రభుత్వ చర్యను ఈ కారణంతో సమర్థించుకోచూడటం ఎలా సమర్థనీయం అవుతుంది?ఇంత కథ ఉంటే, బిసి కార్డు, మహిళా కార్డు వాడి ప్రయోజనం ఏముంది? వెనుకబడిన తరగతుల ప్రజలకు జరుగుతున్న నష్టం గురించో, మహిళలకు జరుగుతున్న అన్యాయాల గురించో గళం ఎత్తినందుకు సురేఖను మంత్రివర్గంలోనుండి తొలగిస్తే ఆ కార్డులు వాడుకుంటే అర్థం ఉంటుంది. ఇక్కడ అవేమీ జరగలేదే. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల పుణె మహిళలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించి సురేఖ తన కుమార్తె దుందుడుకు వ్యాఖ్యలను సమర్థించుకోచూడటంలో అర్థం లేదు. రాహుల్ మహిళలు సొంత వ్యక్తిత్వం కలిగి ఉండాల్సిన అవసరాన్ని గురించి చాలా అద్భుతంగా చెప్పారు.ఇవన్నీ రాజకీయాల్లో కొత్తగా ఏమీ జరగడం లేదు కానీ, సురేఖ వ్యవహారంతో మళ్ళీ ఒకసారి జనంలో చర్చ జరిగి ఈ అపసవ్య ధోరణులకు అడ్డుకట్ట పడితే బాగుండునన్న ఆశ. ప్రజాస్వామ్యానికి రాజకీయాలు చాలా అవసరం. అవి ఆరోగ్యవంతంగా నడిస్తేనే ప్రజలకు మంచి జరుగుతుంది. మీసాలు తిప్పడం, తొడలు కొట్టి సవాలు చెయ్యడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఏ మాత్రం అనుసరణీయం కావు. మొన్న సురేఖ బర్తరఫ్ వార్త వెలువడిన సమయంలో ఆమె భర్త కొండా మురళి మీసాలు తిప్పుతున్న దృశ్యాన్ని ప్రసార మాధ్యమాలు రోజంతా పదేపదే చూపించి ఏం చెప్పదల్చుకున్నట్టు? మురళి గత చరిత్ర తెలియనివాళ్ళు తెలంగాణాలో.. ముఖ్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఎవరయినా ఉన్నారా? ఆయన మీద నేరారోపణలతో ఉన్న కేసుల చిట్టా విప్పితే చాటభారతం అంత అవుతుంది. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ పోలీస్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఐపిఎస్ అధికారి నళిన్ ప్రభాత్ నుండి తెలంగాణకు చెందిన మరో ఐపిఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాసరెడ్డి వరకూ ఎవరినడిగినా చెప్తారు.కాంగ్రెస్‌లో అసమ్మతి పెరుగుతుందా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి సురక్షితమేనా, కాంగ్రెస్ ఓడుతుందా, గెలుస్తుందా, కొండా సురేఖ కుటుంబం కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీని వెతుక్కుంటుందా లేక ఇదే పార్టీలో ఉండి అసమ్మతి కుంపటి రాజేసే ప్రయత్నం చేస్తుందా అన్నది కాదు ఇక్కడ ఆలోచించాల్సింది. ఈ పెడధోరణులు ఇలా కొనసాగవలసిందేనా, కొత్త తరాలు ఈ సంస్కృతిని మార్చే ప్రయత్నం చేస్తాయా అని.

## జనాల్లోకి జై కొట్టు నినాదం

విజయవాడ, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ యువ ఓటర్లపై కన్నేశారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదు.. రానున్న ఏ ఎన్నికల్లోనైనా యువత ఓటర్లను ఆకట్టుకోవాలన్న లక్ష్యంగా జనసేన పనిని ప్రారంభించింది. ఇందులో భాగంగా జనసేన యువజన విభాగాన్ని ఆర్భాటంగా పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నాడు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా జెన్ జీ ఫీవర్ అన్ని రాజకీయ పార్టీలను పట్టిపీడిస్తుంది. అందులో భాగంగా జనసేన కూడా యువత ఓట్ల కోసం వేట ప్రారంభించింది. పవన్ కల్యాణ్ పై గత రెండేళ్ల నుంచి ఎలాంటి అవినీతి ముద్ర పడలేదు. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సజావుగా, సమర్థవంతంగా చేస్తున్నారన్న ప్రశంసలను కూడా అందుకుంటున్నారు. అవినీతి మరక అంటకుండా ఉన్న తనకు అండగా నిలబడాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నారు. యువత అండగా నిలిస్తే విజయం నల్లేరు మీద నడకేనని భావిస్తున్నారు.ఇలాగే తన వైఖరిని కొనసాగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూ జనసేనకు కూటమిలో పొత్తులో భాగంగా అత్యధిక స్థానాలను పొందవచ్చు. యువ నేతలకు పోటీకి అవకాశమిస్తే ప్రజల నుంచి కూడా ఆదరణ లభించే ఛాన్స్ ఉంది. కేవలం కాపు సామాజికవర్గానికి చెందిన ఓటర్ల పైనే ఆధార పడకుండా యువ ఓటర్లను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. పవన్ కల్యాణ్ కేరళ నుంచి తిరిగి వచ్చిన వెంటనే యువతతో ప్రత్యేక సమావేశాలను కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకవైపు పార్టీ బలాన్ని పెంచుకోవడం, ఓటు బ్యాంకు పెంచుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింతగా ఎదిగే అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ నాయకత్వం కూడా అంచనా వేస్తుంది. యువత, మహిళ ఓటర్లను ఆకట్టుకోగలిగితే ఇక తనపై సామాజికవర్గం ముద్ర పడకపోయినా పెద్దగా ఉండదని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జైకొట్టు నినాదంతో... జనసేన పార్టీ యువతను, ముఖ్యంగా 'జెన్-జీ' ని ఆకట్టుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తోంది.'జై కొట్టు' యువజన విభాగంపవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా పిఠాపురంలో జనసేన తొలిసారిగా ప్రత్యేక యువజన విభాగాన్ని ఆవిష్కరించింది.'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' స్ఫూర్తితో ఈ విభాగానికి 'జై కొట్టు' అని పేరు పెట్టారు.జెన్-జీ యువతను రాజకీయాల్లోకి, సామాజిక కార్యక్రమాల్లోకి భాగస్వామ్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. నేటి తరానికి తగినట్లుగా ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సంభాషణలు సాగించనున్నారు.సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో యువత అయితే మరింత పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలుగుతారన్న నమ్మకంతో ఉన్నారు. మొత్తం మీద జనసేన ఇప్పుడు జెన్ జీ ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహంతో పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారు. మరి పవన్ జెన్ జీ వ్యూహం ఎంత మేరకు ఫలిస్తుందన్నది చూడాలి.

## సెప్టెంబర్ 9వ తేదీ లోపు ఇరాన్‌పై దాడి

న్యూఢిల్లీ, ఇరాన్‌పై పునఃప్రారంభించిన సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. అయితే, అవసరమైతే అమెరికా మళ్లీ దాడి చేయవచ్చని ఆయన హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ రెండు అంశాలు ఒక అతిపెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి:ఇరాన్ జాతకం, వార్షిక అంచనాలు, రాబోయే ఆరు రోజుల పంచాంగాన్ని పరిశీలిస్తే, ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. సెప్టెంబర్ 6, 8 తేదీలు ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అయితే, దీనిని దాడి కచ్చితంగా జరుగుతుందని చెప్పే అంచనాగా పరిగణించలేము. ఈ తేదీలలో జరిగే ఏ సైనిక చర్య అయినా, ప్రతీకార దాడి అయినా, నౌకకు సంబంధించిన సంఘటన అయినా, లేదా సాంకేతిక వైఫల్యం అయినా ఉద్రిక్తతలను పెంచవచ్చు.ఇరాన్‌పై అమెరికా చేపట్టిన కొత్త సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని సెప్టెంబర్ 2న ట్రంప్ అన్నారు. హోర్ముజ్ సమీపంలో అమెరికా సైన్యం ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలు, సముద్ర మైన్లు అమర్చే పరికరాలను ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఎప్పుడైనా మరో దాడిని ప్రారంభించవచ్చని ట్రంప్ కూడా పేర్కొన్నారు. దీని అర్థం, సైనిక చర్యను నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. మరో దాడి జరుగుతుందా లేదా అనేది ఇరాన్ ప్రతిస్పందన ,హోర్ముజ్‌లోని పరిస్థితిపై ఆధారపడి ఉంటుందిఅమెరికా జరిపిన తాజా దాడులతో ఇరాన్ జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలు, ప్రయోజనాల వైపు క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఈ దాడులలో పలువురిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఆ దేశం ప్రకటించింది. అమెరికా దాడుల్లో 18 మంది మరణించారని, 108 మంది గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది. హోర్ముజ్ సమీపంలో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. పౌర మృతిపై వచ్చిన నివేదికలపై దర్యాప్తు చేస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఈ సంఘటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్ తన ప్రతీకార చర్యలను తీవ్రతరం చేస్తే, అమెరికా దీనిని ఒక కొత్త దాడికి ఆధారంగా ఉపయోగించుకోవచ్చు. మరోవైపు, ఇరాన్ మౌనం దాని సొంత దేశంలోనే బలహీనతగా భావించబడవచ్చు.సెప్టెంబర్ 6వ తేదీ ఆకస్మిక సైనిక లేదా సాంకేతిక సంఘటనకు అత్యంత అవకాశం ఉన్న రోజు. సెప్టెంబర్ 8వ తేదీ ప్రత్యర్థి పక్షం ద్వారా మరో ప్రధాన చర్య లేదా ఎదురుదాడికి వేదిక కావచ్చు.సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని ట్రంప్ చెబుతున్నప్పటికీ, సెప్టెంబర్ 9వ తేదీకి ముందే యుద్ధం మరో మలుపు తిరగవ చ్చు. ఆ తర్వాత కాల్పులు పూర్తిగా ఆగిపోయే అవకాశం లేదు. కానీ, చర్చల కోసం యుద్ధం తిరిగి ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఖచ్చితంగా పెరుగుతుంది.

## కేసీ కెనాల్ కు నీటి విడుదల..

నంద్యాల, నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల, మల్యాల ఎత్తిపోతల పథకం ల నుంచి కర్నూలు - కడప (కేసీ కెనాల్ ) కు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు నీటి విడుదల చేసినట్లు ముచ్చుమర్రి టీడీపీ నాయకులు కాటం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అనుచరులు, ముచ్చుమర్రి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కాటం. వెంకటరామిరెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి.నాగరాజుల, ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, సుబ్బారావు, బాల నారాయణ, ఆంజనేయ నగర్ రవి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా జనం తరలిరావడంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణమ్మకు కుంకుమ, పసుపు, గాజులు, వడిబియ్యం కొత్త చాటలో పెట్టి సారే సమర్పించి, కృష్ణమ్మ జలహారతి ఇచ్చి కేసీ కెనాల్ కు నీటి విడుదల చేశారు. కేసి కెనాల్ డి ఈ ఈ ప్రసాద్, ఏ ఈ ఈ లు వీరమ్మ, శ్రీనివాస నాయక్ లు మాట్లాడుతూ ఉదయం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలకు ఉన్నతాధికారులు

# ద్వారంపూడిపై ప్రభుత్వం దృష్టి

కాకినాడ,కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

# ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర

విజయవాడ,దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్-ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒఇంఖ యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్-బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది.

# లోకల్ బాడీ ఎన్నికలకు కసరత్తు షురూ

విజయవాడ,ఏపీలో కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం మంత్రులు, కీలక నేతలతో సీఎం టింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులు, కూటమి పార్టీల సమన్వయంపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేష్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# మద్యం ఆదాయంతోనా మనుగడా?



హైదరాబాద్,ప్రభుత్వానికి ఆదాయం రావడం తప్పు కాదు. కానీ ఆ ఆదాయానికి మూలం ఏమిటన్నదే అసలు ప్రశ్న. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యం అమ్మకాలపై ప్రభుత్వ ఖజానాలు ఆధారపడాల్సిన పరిస్థితి వస్తే.. అది కేవలం ఆర్థిక అంశంగా చూడగలమా? ఒకవైపు మద్యపానాన్ని తగ్గించాలని ప్రచారం చేస్తూనే.. మరోవైపు మద్యం అమ్మకాల ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుకోవడం ప్రభుత్వ విధానాల్లో కనిపిస్తున్న వైరుధ్యాన్ని బయటపెడుతోంది. మద్యం విక్రయాలు పెరిగితే ఖజానా నిండొచ్చు. కానీ అదే సమయంలో కుటుంబాలపై ఆర్థిక భారం పెరగడం, ఆరోగ్య సమస్యలు తీవ్రమవడం, సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతుంటే.. ఆ ఆదాయాన్ని అభివృద్ధికి విజయంగా ఎలా పరిగణించాలి? ప్రజల అవసరాల నుంచి వచ్చే ఆదాయం ఒక ఎత్తయితే.. ప్రజల బలహీనత నుంచి వచ్చే ఆదాయం మరో ఎత్తు. అయితే ప్రశ్న ఒక్కటే -ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థకు మద్యం ఎంతకాలం ప్రధాన ఆధారంగా ఉండాలి? ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం కంటే మద్యం ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తున్నామా? అనేది ఆలోచించాలి.భారతదేశంలో ఏ రాష్ట్ర బడ్జెట్ చూసినా, ఏటా ఆదాయ వనరుల లెక్కలు తీసినా ఒక చేదు నిజం స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల ఆర్థిక బండిని నడిపిస్తోంది 'మద్యం' అమ్మకాలే! ఉచిత పథకాలు, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు... ఇలా దేనికైనా సరే, మద్యం ద్వారా వచ్చే ఎక్సైజ్ ఆదాయమే రాష్ట్ర ప్రభుత్వాలకు కామధేనువులా మారిందంటే అతిశయోక్తి కాదు. ఒక రకంగా చెప్పాలంటే, నేడు దేశంలో 'మద్యం అమ్మకాలతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి' అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. దేశవ్యాప్తంగా వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలకు సొంతంగా పన్నులు పెంచుకునే హక్కులు చాలా వరకు తగ్గిపోయాయి. కానీ, మద్యం, పెట్రోలియం ఉత్పత్తుల జిఎస్‌టి పరిధి నుంచి మినహాయించారు. ఇదే రాష్ట్ర ప్రభుత్వాలకు అతిపెద్ద అస్త్రంగా మారింది. ఒక విధంగా చెప్పాలంటే వరంగా మారిందనే చెప్పాలి.ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడల్లా, బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి ప్రభుత్వాలు ఎంచుకునే తక్షణ మార్గం మద్యంపై పన్నులు పెంచడమే. బాటిల్ ధర రూ. 1000.. ప్రభుత్వ వాటా రూ. 700! మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వాలు ఏ స్థాయిలో లాభపడుతున్నాయో తెలియజేసే విశ్లేషణ ఇది. మీరు కొనే ప్రతి రూ. 1,000 మద్యం బాటిల్‌పై దాదాపు రూ. 350 నుండి రూ. 700 వరకు పన్నుల రూపంలోనే ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. అంటే మద్యం అసలు తయారీ ధర, రవాణా ఖర్చుల కంటే దానిపై ప్రభుత్వాలు విధించే పన్నులే రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. పండుగల సీజన్‌లో కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే వందల, వేల కోట్ల రూపాయల మద్యం అమ్ముడుపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి కోడిపందాలు, విందు వినోదాల కారణంగా పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. పట్టణాల కంటే గ్రామీణ జిల్లాల్లో ఈ సమయంలో విక్రయాలు రెట్టింపవుతాయి. తెలంగాణలో దసరా పండుగ సమయంలో మద్యం విక్రయాలు భారీగా ఉంటాయి. ఇంకా వివరంగా చెప్పాలంటే డిసెంబర్ ఆఖరి మూడు రోజుల్లో అంటే డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కలిపి దాదాపు రూ. 1,000 కోట్ల నుండి రూ. 1,300 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతాయి. ప్రతి నిమిషానికి సగటున 90 కి పైగా లిక్కర్ బాటిళ్లు అమ్ముడవుతుంటాయి. ఈ ట్రెండ్ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉంది. కేరళలో ఓనమ్ పండుగ సమయంలో కేరళ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా కేవలం 10 -12 రోజుల్లోనే దాదాపు వెయ్యికోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగి సరికొత్త రికార్డు సృష్టించాయి.మద్యం ఆదాయంలో టాప్ రాష్ట్రాల విషయానికి వస్తే.. దేశంలో మద్యం వినియోగం, దాని ద్వారా వచ్చే రాబడి ఏటా రికార్డు స్థాయిలను తాకుతోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఇందులో ముందు వరుసలో ఉన్నాయి. దేశంలో తలసరి మద్యం ఖర్చులో అగ్రస్థానంలో ఉంది తెలంగాణ. ఇక్కడ ఏడాదికి సగటున ఒక వ్యక్తి మద్యం కోసం రూ. 11,351 ఖర్చు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వానికి దీని ద్వారా ఏటా రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం లభిస్తోంది. ఇక కర్నాటక విషయానికి వస్తే దాదాపు రూ. 34,000 కోట్ల వార్షిక ఆదాయంతో దేశంలోనే అత్యధిక పన్నులు వసూలు చేసే రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. తమినాడు ప్రభుత్వ యాజమాన్యంలోని 'టాస్మాక్' (ూూహీూజ) ద్వారా ఏటా రూ. 32,000 కోట్లకు పైగా రాబడి వస్తోందని అంచనా. ఆంధ్రప్రదేశ్ లో తలసరి వార్షిక మద్యం ఖర్చు సగటున రూ. 6,399 గా ఉంది, దీని ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ. 17,500 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాల్లో కూడా ఏటా రూ. 12,000 కోట్ల నుండి రూ. 14,000 కోట్ల వరకు ఎక్సైజ్ రాబడి వస్తోంది.ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్య, వైద్య, రైతు భరోసా, పెన్షన్లు వంటి సామాజిక సంక్షేమ పథకాలకు మద్యం అమ్మకాలే ప్రధాన ఇంధనంగా మారుతున్నాయి. మద్యం ద్వారా వచ్చే ఆదాయం నిలిచిపోతే, ఈ పథకాలను కొనసాగించడం దాదాపు అసాధ్యం అనే పరిస్థితి నెలకొంది. అందుకే ఎన్నికల సమయంలో 'మద్య నిషేధం' అని హామీలు ఇచ్చే రాజకీయ పార్టీలు సైతం, అధికారంలోకి వచ్చాక ఆర్థిక వాస్తవాలను చూసి వెనకడుగు వేస్తున్నాయి. నిబంధనలను సడలిస్తూ, సరికొత్త మద్యం పాలసీలతో అమ్మకాలను మరింత ప్రోత్సహిస్తున్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వాల ఖజానా నిండుతున్న మాట వాస్తవమే అయినా, దీని వెనుక ఒక తీవ్రమైన సామాజిక నష్టం దాగి ఉ

# సవాళ్లలో వేడెక్కిన రాజకీయం...

మెదక్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థి బీఆర్ఎస్‌పై విసిరిన కేసీఆర్ రాజీనామా డిమాండ్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడిని రాజేసింది. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలతో కేసీఆర్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేందుకు కాంగ్రెస్ ఈ పావు కదిపినప్పటికీ, ఇది పొరపాటున నిజమైతే ఉత్పన్నమయ్యే పరిణామాలు అధికార పక్షానికి సవాలుగా మారే అవకాశముంది. కేసీఆర్ నిజంగానే గజ్వేల్ నియోజకవర్గానికి రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, అది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలనపై ఒక ప్రత్యక్ష రెఫరెండం గా మారే ప్రమాదం ఉంది.తెలంగాణ రాజకీయ చరిత్రను తిరగేస్తే కేసీఆర్‌కు ఉపఎన్నికల వ్యూహం కొత్తేమీ కాదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ ఆయుధంగా మలచుకుని, సెంటిమెంట్‌ను రగిలించి విజయం సాధించేవారు. ప్రతీ ఉపఎన్నికను తన ఆధిపత్య నిరూపణకు వేదికగా వాడుకున్న అనుభవం ఆయనది. నేడు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ఉచిత హామీల అమలు ఆలస్యం, రైతు భరోసా, మౌలిక వసతుల సమస్యల ప్రతికూలతలను ఆసరాగా చేసుకుని కేసీఆర్ గనుక సవాల్‌ను స్వీకరిస్తే, పరిస్థితి కాంగ్రెస్‌కు కత్తిమీద సాము లా మారడం ఖాయం.ఒకవేళ గజ్వేల్ ఉపఎన్నిక అనివార్యమైతే, అది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుంది. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో పుంజుకుని ప్రధాన ప్రతిపక్ష స్థానం వైపు వేగంగా అడుగులు వేస్తున్న భారతీయ జనతా పార్టీ ఒక్కసారిగా రేసులో వెనుకబడిపోయే అవకాశం ఉంటుంది. సమరం నేరుగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా రూపాంతరం చెందుతుంది. ఇది గులాబీ దళానికి పోగొట్టుకున్న క్యాడర్ ఉత్సాహాన్ని తిరిగి తెచ్చిపెట్టడమే కాకుండా, బిజెపి ప్రాబల్యాన్ని తాత్కాలికంగా పక్కకు నెట్టి మళ్లీ ప్రధాన పోరు తమదేనని నిరూపించుకోవడానికి ఒక సువర్ణావకాశం అవుతుంది.అయితే కాంగ్రెస్ పార్టీ ఈ సవాల్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. అధికారంలో ఉన్నందున ప్రభుత్వ సర్వ శక్తులూ ఉపయోగిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కేసీఆర్ ఈ సాహసం చేయరనే ధీమాతోనే ఈ విమర్శలు గుప్పించారు. ఒకవేళ ఉపఎన్నిక వస్తే, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ వ్యూహరచన చేస్తుంది. అయితే, అధికారంలో ఉండి ఉపఎన్నికలో ఎదురుదెబ్బ తగిలితే ప్రభుత్వ ప్రతిష్ట దారుణంగా దెబ్బతింటుందనే ఆందోళన కూడా కాంగ్రెస్ పెద్దల్లో అంతర్లీనంగా ఉందనడంలో సందేహం లేదు.కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకుంటారా అనేది అతిపెద్ద ప్రశ్నార్థకం. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపఎన్నికకు వెళ్లడం బీఆర్ఎస్‌కు క్లిష్టమైన సవాలే. గెలిస్తే ఒక్కసారిగా పార్టీ గ్రాఫ్ ఆకాశాన్ని తాకుతుంది. కానీ పొరపాటున అధికార కాంగ్రెస్ చేతిలో పరాజయం ఎదురైతే బీఆర్ఎస్ ఉనికికే అది ప్రమాదకరంగా మారుతుంది. గత సార్వత్రిక ఎన్నికల దెబ్బ నుంచి పార్టీ పూర్తిగా కోలుకోని నేపథ్యంలో, అంతటి పెద్ద సాహసానికి కేసీఆర్ రెడీ అవుతారా అన్నది సందేహమే. రేవంత్ రెడ్డి సవాల్‌తో తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. కేసీఆర్ రాజీనామా చేసి ఉపఎన్నిక బాట పడితే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీల భవిష్యత్తును, రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలను తేల్చే అగ్నిపరీక్షగా మారడం ఖాయం గులాబీ బాస్‌ను నైతికంగా ఆత్మరక్షణలోకి నెట్టి, కేడర్‌లో నైరాశ్యాన్ని మరింత పెంచాలనేది అధికార పక్షం వ్యూహంగా కనిపిస్తున్నప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మాత్రం దీన్ని కాంగ్రెస్ వేస్తున్న అతి పెద్ద జూదంగానే భావిస్తున్నారు. కేసీఆర్ ఒకవేళ ఊహించని విధంగా ఈ సవాల్‌ను స్వీకరిస్తే, అది రేవంత్ రెడ్డి సర్కారుకు ముళ్లబాటగా మారే ప్రమాదముంది.సార్వత్రిక ఎన్నికల్లో విజయం, అధికార యంత్రాంగం చేతిలో ఉండటం రేవంత్ రెడ్డిలో దూకుడును, విపరీతమైన ఆత్మవిశ్వాసాన్ని పెంచాయనడంలో సందేహం లేదు. 'కేసీఆర్ ఎలాగూ రాజీనామా చేసే సాహసం చేయరు' అన్న గుడ్డి ధీమాతోనే కాంగ్రెస్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయాల్లో



అతి విశ్వాసం ఎప్పుడూ ప్రమాదకరమే. ఒకవేళ కేసీఆర్ గజ్వేల్‌కు రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు రేవంత్ పాలనపై అది నేరుగా ప్రజా రెఫరెండంగా మారుతుంది.ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా నిధుల విడుదల, రైతు రుణమాఫీ ప్రక్రియలోని సాంకేతిక చిక్కులు, పింఛన్ల పెంపు వంటి అంశాలపై ప్రజల్లో అసహనం మొదలవుతోంది. పాలనాపరమైన ఈ ఒత్తిళ్లను బేరీజు వేసుకోకుండా కేసీఆర్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే లక్ష్యంగా రాజీనామా డిమాండ్ చేయడం రేవంత్ వ్యూహాత్మక తప్పిదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ బ్రహ్మాస్త్రంగా మలచుకున్న నాయకుడు. 2004 నుంచి 2014 వరకు ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు కేసీఆర్, ఆయన సహచరులు పదేపదే రాజీనామాలు చేసి, ఉద్యమ సెంటిమెంట్‌తో ఉపఎన్నికల్లో అఖండ విజయాలు సాధించిన రికార్డు ఉంది. ప్రజా వ్యతిరేకత కాస్త మొదలవుతున్న సమయంలో కేసీఆర్ గనుక బరిలోకి దిగితే, "తెలంగాణ తెచ్చిన నన్ను అధికార కాంగ్రెస్ అణగదొక్కాలని చూస్తోంది" అన్న సెంటిమెంట్‌ను రగిలించే అవకాశం ఉందిగజ్వేల్ కేసీఆర్‌కు కంచుకోట. హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆ నియోజకవర్గంలో ఆయనకు గట్టి పట్టుంది. పైగా గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మూడే స్థానంలో నిలిచింది. ఈ ఉపఎన్నిక అనివార్యమైతే, అది కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారుతుంది. అధికార పక్షంగా సర్వశక్తులూ ఒడ్డి కేసీఆర్‌ను ఓడించేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నించినా, ఫలితం ఏమాత్రం తేడా కొట్టినా ఆ ప్రభావం నేరుగా రేవంత్ రెడ్డి సీఎం కుర్చీపై, కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై పడుతుంది.లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో భారతీయ జనతా పార్టీ గణనీయంగా పుంజుకుని, తామే ప్రధాన ప్రతిపక్షమనే భావనను కలిగించే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సైతం బీజేపీనే ప్రధాన శత్రువుగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్‌ను కాలగర్భంలో కలిపేసే వ్యూహాన్ని అమలు చేస్తోంది. కానీ గజ్వేల్ ఉపఎన్నిక జరిగితే, దృశ్యం ఒక్కసారిగా మారిపోతుంది. బీజేపీని పూర్తిగా పక్కకు నెట్టేసి, రాజకీయం అంతా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారుతుంది. ఉపఎన్నికలో కేసీఆర్ విజయం సాధిస్తే, అది నిస్తేజంలో ఉన్న గులాబీ కేడర్‌కు బూస్టర్ డోస్ ఇవ్వడమే కాకుండా, రాష్ట్రంలో తమ ప్రాబల్యాన్ని పునరుద్ధరించుకోవడానికి సువర్ణావకాశాన్ని ఇస్తుంది. అదే జరిగితే, రేవంత్ రెడ్డి స్వయంగా కోరి కష్టాలు కొనితెచ్చుకున్నట్లవుతుంది.అయితే, ఉపఎన్నికలో ఒకవేళ ఓడిపోతే బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వస్తుందన్న భయం కేసీఆర్‌కు కూడా ఉంది. కానీ కేసీఆర్ రాజకీయ చదరంగంలో ఎలాంటి నిర్ణయమైనా ఆకస్మికంగా తీసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాల్ కేసీఆర్‌ను దెబ్బతీయడం కంటే, కాంగ్రెస్ పార్టీని ఒక క్లిష్టమైన రాజకీయ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. రేవంత్ విసిరిన ఈ పాచిక కేసీఆర్ స్వీకరిస్తే, తెలంగాణ రాజకీయం భీకర సమరానికి వేదిక కావడం ఖాయం.

# వ్యాపారాలు జోరందుకున్నా ఎస్‌జీఎస్టీ ఎందుకు పడిపోయింది

విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తర్వాత పరిశ్రమలు వస్తున్నాయని, నిర్మాణ రంగానికి ఊపొచ్చిందని, వ్యాపార లావాదేవీలు క్రమంగా పుంజుకుంటున్నాయని అధికార వర్గాలు చెబుతున్న తరుణంలో.. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ , కేంద్ర జీఎస్టీ పోర్టల్ విడుదల చేసిన తాజా గణాంకాలు ప్రభుత్వానికి ఊహించని షాక్ ఇచ్చాయి. 2025-26 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్లో రాష్ట్ర సొంత వస్తు సేవల పన్ను రాబడి ఏకంగా మైనస్ 7 శాతం క్షీణించింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం గతేడాది కంటే పెరగాల్సింది పోయి, ఏకంగా నెగెటివ్ గ్రోత్‌లోకి జారిపోవడం ఆర్థిక నిపుణులను, ప్రభుత్వ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.మార్కెట్‌లో కనిపిస్తున్న సందడికి, ప్రభుత్వ ఖజానాకు చేరే నికర రాబడికి మధ్య ఎందుకు ఇంత భారీ అంతరం ఏర్పడిందనేదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ఒకవైపు నిర్మాణ పనులు వేగం పుంజుకోవడం, ఇసుక పాలసీ మార్పులు, వ్యాపారాల్లో కొనుగోళ్లు మెరుగైనట్లు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నప్పటికీ.. పన్నుల లెక్కల్లో ఆ గ్రోత్ కనిపించకపోవడం వెనుక ప్రధానంగా సాంకేతిక, ప్రక్రియపరమైన లొసుగులు ఉన్నాయని చెబుతున్నారు. వ్యాపారాలు జరిగినంత మాత్రాన పన్నులు వెంటనే ప్రభుత్వ ఖాతాలోకి జమ కావు. ముఖ్యంగా వర్తకులు గతంలో నిలిచిపోయిన పెద్దమొత్తం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకోవడం వల్ల ప్రస్తుత త్రైమాసికంలో చెల్లించాల్సిన నికర నగదు పన్ను నామమాత్రంగా మారిపోయింది.మరో ప్రధాన కారణం ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లలో జరిగిన తీవ్రమైన జాప్యం. ఏపీ ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి సరుకులను ఎక్కువగా దిగుమతి చేసుకునే వినియోగ ఆధారిత రాష్ట్రం. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వస్తువులపై కేంద్రం వసూలు చేసే ఐజీఎస్టీ నిధులను రాష్ట్రాలకు క్రమం తప్పకుండా సెటిల్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ తొలి త్రైమాసికంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లు సమయానికి కాగ్ ఖాతాల్లో సర్దుబాటు కాకపోవడం వల్ల, కాగితాలపై రాష్ట్ర సొంత ఎస్‌జీఎస్టీ వసూళ్లు తక్కువగా రికార్డయ్యాయి. వస్తువుల వినియోగం పెరిగినా, కేంద్ర సెటిల్‌మెంట్లలో జాప్యం జరిగితే ఆ ప్రభావం నేరుగా రాష్ట్ర లెక్కల్లో పతనంగా కనిపిస్తుంది. పొరుగు రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ తేడా మరింత స్పష్టంగా, ఆందోళనకరంగా బయటపడుతోంది. పక్కనే ఉన్న తెలంగాణలో తొలి త్రైమాసికంలో ఎస్‌జీఎస్టీ వృద్ధి ఏకంగా ప్లస్ 16 శాతంగా నమోదు కాగా, కర్ణాటక , కేరళ , మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రెండంకెల స్థాయిలో పన్ను రాబడిని పెంచుకున్నాయి. ఒకే దేశం, ఒకే రకమైన జీఎస్టీ చట్టాలు ఉన్నప్పటికీ తమిళనాడు , రాజస్థాన్ , ఒడిశాలతో పాటు ఏపీ కూడా మైనస్ గ్రోత్‌లోకి పడిపోవడం చూస్తే.. ఇతర రాష్ట్రాలు తమ తయారీ, సేవా రంగాల నుంచి నగదు రూపేణా పన్ను రాబడిని రాబట్టుకుంటున్న వేళ, ఏపీ మాత్రం పన్ను వసూళ్ల వ్యవస్థలో లీకేజీలు, రిటర్న్ల పరిశీలనలో వెనుకబడిపోయిందని స్పష్టమవుతోంది.దీనికి తోడు క్షేత్రస్థాయిలో వ్యాపారాలు జరుగుతున్నా.. అవి పన్ను నెట్‌వర్క్‌లోకి పూర్తిగా రాని అసంఘటిత లావాదేవీలుగానే మిగిలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. రిటైల్ మార్కెట్లో చాలావరకు బిల్లులు లేకుండా జరిగే అమ్మకాలు, చెక్‌పోస్టులు లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి పన్ను ఎగవేసి వచ్చే అక్రమ సరుకు రవాణాను కట్టడి చేయడంలో వాణిజ్య పన్నుల శాఖ తగినంత దూకుడు ప్రదర్శించలేకపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంటున్నప్పటికీ, అవి పూర్తిస్థాయిలో ఉత్పత్తి దశకు వచ్చి పన్నులు సమకూరేందుకు కొంత సమయం పడుతుందన్నది వాస్తవమే అయినా, ఇప్పటికే ఉన్న మార్కెట్ నుంచి రావాల్సిన పన్నులు జారిపోవడం యంత్రాంగ లోపమేనని చెప్పాలి. ఈ మైనస్ 7 శాతం పతనం రాబోయే బడ్జెట్ నిర్వహణపై, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తీవ్ర ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉంది. ఉచిత పథకాలు, సూపర్ సిక్స్ హామీలకు వేల కోట్ల రూపాయల నిధులు అవసరమైన ప్రస్తుత పరిస్థితుల్లో.. సొంత పన్నుల రాబడే పడిపోతే అప్పులపై ఆధారపడటం మినహా మరో దారి ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఐటీసీ క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయి ఆడిటింగ్ నిర్వహించడం, ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లను కేంద్రంతో సమన్వయం చేసుకుని త్వరితగతిన తెచ్చుకోవడం, జీఎస్టీ ఎగవేతలపై నిఘా పెంచడం వంటి చర్యలు చేపట్టకపోతే ఖజానా మరింతగా లోటులోకి జారుకోవడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఎల్ నినోను ఎదుర్కొందాం

అమరావతి: రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంది. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత అతి తక్కువ వర్షపాతం నమోదైందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు కార్యోన్ముఖులు కావాలని మంత్రులకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా తాగడానికి నీరు లేదన్న పరిస్థితి రాకూడదని, ఇప్పటికే వేసిన పంటల్లో ఒక్క ఎకరం కూడా ఎండకూడదని, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావ తీవ్రతను వివరిస్తూ, తగిన సాయం చేయాలని కేంద్రానికి లేఖ రాస్తున్నానని, ఇకపై ప్రతి నెలా లేఖ పంపిస్తామని ఆయన గురువారం మంత్రివర్గ సమావేశంలో పేర్కొన్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం రాష్ట్రంలోనే నమోదైందని, ఇప్పటి వరకు 56% లోటు ఉందని తెలిపారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 77, ప్రకాశం జిల్లాలో 70 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఆయన పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంపై మంత్రివర్గ సమావేశంలో గంటన్నరకు పైగా చర్చించారు. జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం మండిపడ్డారు. దీన్ని సమర్థంగా తిప్పికొట్టడంతో పాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులకు సూచించారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని.. ప్రజలకు, పశువులకు తాగునీటికి, ఆ తర్వాత పండ్ల తోటలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా సిద్ధమన్నారు.ఎప్పటికప్పుడు సమీక్షించండి:"ఇలాంటి సంక్షోభ సమయంలోనే నాయకుల్లోని సమర్థత బయటపడుతుంది. మంత్రులు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. అందుబాటులో ఉన్న నీటి వనరులతో ఈ విపత్తు నుంచి ఎలా గట్టెక్కగలమో ఆలోచించాలి. ఎల్ నినో ప్రభావం ఉన్నా జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా తగ్గకూడదు. ఇకపై ప్రతి కేబినెట్ సమావేశంలో 20 నిమిషాలు ఈ అంశంపై చర్చిద్దాం. మీరు (మంత్రులు) కూడా రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సొసైటీలతో సమావేశాలు నిర్వహించి పరిస్థితి వివరించండి. భూగర్భ జల మట్టాల్ని చూసుకుని, అవసరమైన చోట బోర్లు వేసి, రైతులకు నీళ్లిచ్చేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించండి. రాష్ట్రంలోని 210 రైతు సేవా కేంద్రాల ద్వారా సీడ్‌బాల్స్‌ను వెదజల్లే కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలి. పశుగ్రాసం పెంచితే పశువులకు దాణాకైనా ఉపయోగపడుతుంది" అని సీఎం పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో నిత్యావసరాల ధరలు పెరగకుండా స్థిరీకరించేందుకు చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాలు, ఆర్థిక, వ్యవసాయ శాఖల మంత్రులు మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడులకు చంద్రబాబు సూచించారు. రైతులజాగ్రత్తతో తక్కువ ధరకు బియ్యం సరఫరా చేస్తున్నామని మనోహర్ చెప్పగా.. మిగతా వస్తువుల ధరల నియంత్రణకూ ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

# రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...



విజయవాడ, సెప్టెంబర్ 7, ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎంతోమంది అయ్యన్నపాత్రుడు కంటే సీనియర్ నాయకులు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కి 80 సంవత్సరాలు ఉంటాయి. ఈయన కూడా అయ్యన్నపాత్రుడితో పాటే 1983 నుంచి టిడిపిలో ఉన్నారు. మరో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు కూడా రాజ్యసభ పదవిని కోరుకుంటున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. కిమిడి కళా వెంకట్రావు.. బండారు సత్యనారాయణమూర్తి వంటి వారు కూడా టిడిపిలో సీనియర్ నేతలుగా పేరు తెచ్చుకున్నారు. అయ్యన్న తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో 2029 ఎన్నికల్లో చంద్రబాబు వీరికి టికెట్ ఇస్తారా.. లేదా అనేది చూడాల్సి ఉంది.

# మండలి కోసం పోటా పోటీ




వరంగల్, సెప్టెంబర్ 7,తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి, అలాగే నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల వేడి గాంధీభవన్‌లో ఇప్పుడే మొదలైంది. అక్టోబర్ నెల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో, అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతల హడావిడి పీక్స్‌కు చేరింది. ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలో ఉమ్మడి ఆరు జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పట్టభద్రుల తీర్పు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారే అవకాశం ఉండటంతో, ఫలితం తేడా వస్తే భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం పడుతుందన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కీలక మంత్రులు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను అధిష్టానానికి పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి ఆశావహులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరిపి జాబితా రూపొందించారు. పార్టీ సీనియర్ నేత, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నేపథ్యం ఉంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నాయి. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నేత గౌరి సతీష్, షాప్ మాజీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు రాకూర్ బాలాసింగ్ పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది.ఇక నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసిన ఇందిర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, పార్టీ నేత లోకేష్ యాదవ్, ఖమ్మం విద్యాసంస్థల అధినేత మొండెం కిరణ్‌కుమార్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం.పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూదనాచారి పదవీకాలం పూర్తవుతుంది. ఈ నాలుగు నామినేటెడ్ స్థానాలు కూడా అధికార కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబంధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకాశం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నాయి.సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గ్రౌండ్ రియాలిటీని బేరీజు వేసుకుంటూ, ఆశావహుల అసంతృప్తి పార్టీపై పడకుండా శాసనమండలి పోరులో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా హస్తం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

# పవన్ వరుస గైర్హాజర్లు...కారణం ఏమిటీ




ఒంగోలు, సెప్టెంబర్ 7,కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ -జనసేన -బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి.అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది. అయితే ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని కూటమి నాయకత్వం దీనిని సానుకూలంగానే చూస్తున్నట్లు తెలుస్తోంది.పవన్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడి సెప్టెంబర్ 10న కేరళ నుంచి తిరిగి వస్తారని సమాచారం. ఈ నెలలోనే మరో కేబినెట్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయన అందులో పాల్గొంటారా లేదా అనే ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఆయన తిరిగి చురుకుగా ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొంటే ఈ గైర్హాజరుపై కొనసాగుతున్న రాజకీయ చర్చలకు కూడా కొంతవరకు తెరపడే అవకాశం ఉంది.

### తిరుపతిలో ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడి

తిరుపతి,తిరుపతి లో ఒక ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడికి దిగారు. బాధితుడి ఫోన్ పగలగొట్టి, మెడలో గోల్డ్ చైన్ లాక్కొని చంపేస్తానంటూ బెదిరింపులకు గురి చేసారు. చెర్లోపల్లి ఆయన్ డిజిటల్ ఎగ్జామినేషన్ సెంటర్ సమీపంలో ఘటన జరిగింది. సుండుపల్లి మండలం మంచిరెడ్డిపల్లికి చెందిన చంద్రమోహన్ పుదీపట్ల కృష్ణ ట్రావెల్స్ లో మేనేజర్ . ఈనెల 4న రోడ్డుపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారికి హారన్ కొట్టాడని అడ్డగించి దాడికి దిగారు. నా పేరు అజీమ్, నేను రౌడీషీటర్, మిమ్మల్ని చంపేస్తా అంటూ దాడి చేసి మెడలోని 9 గ్రాముల బంగారు చైను లాక్కున్నాడు. బాధితుడు పి.చంద్రమోహన్ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు.

# ఆంధ్రా పేపర్ మిల్లుకు షాక్.. రూ.21 కోట్ల భారీ జరిమానా...




రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలోని ప్రముఖ ఆంధ్రా పేపర్ మిల్లుపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కఠిన చర్యలు చేపట్టింది. పర్యావరణ నిబంధనలను పదేపదే ఉల్లంఘించడమే కాకుండా గోదావరి నదిలోకి కాలుష్య వ్యర్థాలను వదులుతున్నట్లు నిర్ధారించిన పీసీబీ, సదరు పరిశ్రమకు రూ. 21.01 కోట్ల భారీ పర్యావరణ పరిహారాన్ని జరిమానాగా విధించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తూర్పులంక పర్యటన సందర్భంగా గుర్తించిన పర్యావరణ లోపాల ఆధారంగా మే, జూన్ నెలల్లో నోటీసులు జారీ చేసినప్పటికీ పరిశ్రమ తీరు మారలేదు. తగినంత సమయం ఇచ్చినా నిబంధనల ఉల్లంఘన కొనసాగుతుండటంతో పీసీబీ ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంది.

పవన్ కళ్యాణ్ తనిఖీల నుంచి పీసీబీ తనిఖీల వరకు: ఏం జరిగింది?

మే 26న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తూర్పులంక ఇసుక మేటల పరిసరాలను పరిశీలించినప్పుడు వ్యర్థాల పారవేతలో లోపాలు వెలుగుచూశాయి. దీంతో మే 28, జూన్ 12 తేదీల్లో పీసీబీ షోకాజ్ నోటీసులు ఇచ్చి, వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. అయితే సెప్టెంబర్ 3న అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లోనూ పరిశ్రమ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టమైంది. దీంతో తక్షణ చర్యగా రూ. 21.01 కోట్ల పెనాల్టీ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గోదావరి పరిరక్షణే ధ్యేయం.. నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదు: జీవనది గోదావరితో పాటు పరిసర ప్రాంతాల్లోకి పరిశ్రమల రసాయన వ్యర్థాలను విడుదల చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఏ పరిశ్రమపైనైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. రాబోయే రోజుల్లో కూడా తనిఖీలను ఉధృతం చేసి, నిబంధనలు పాటించని పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు తేల్చిచెప్పారు.

### నెల్లూరు జిల్లా వాసి ఒంగోలులో లాక్ అప్ డెత్ !


ఒంగోలు,ఒంగోలు పోలీసుల లాకప్లోనే తన కుమారుడ్ని చంపేశారని బాధిత తల్లి కన్నీరు పెడుతోంది. పొలాల్లో దివ్యతేజ మృతదేహం లభ్యం అయింది. బోగోలు మండలంకు చెందిన దివ్య తేజను పోలీసులే హతమార్చారని తల్లి, సోదరి ల ఆరోపణ. విచారణ నిమిత్తం తీసుకెళ్ళి తమకు తెలియదు అని పోలీసులు వాదించారు. ఐదు రోజులు దివ్యతేజ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించాం.. మిస్సింగ్ కేసు కూడా నమోదు చేయాలి అని ఒత్తిడి తెచ్చామని అన్నారు.పోలీసులే తీసుకెళ్ళి తీవ్రంగా గాయపరిచారు, పోలీస్ దెబ్బలకే తేజ చనిపోయాడు. మృతదేహాన్ని కూడా మాయం చేయాలి అని చూశారు. హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఒక గంటలో మృతిదేహం లభించింది అని డ్రామా చేశారని ఆరోపించారు. హైకోర్టును ఆశ్రయించకపోయింటే శవాన్ని కూడా ఇచ్చే వారు కాదు. మాకు ఈ ప్రభుత్వం పై, పోలీసులపై నమ్మకం లేదు.

# కేసీఆర్ గైర్హాజరు కథేంటీ...



హైదరాబాద్, తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా రాజకీయ వర్గాల్లోనూ, సాధారణ ప్రజానీకంలోనూ నలిగే ఏకైక ప్రశ్నకు బీఆర్ఎస్ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లభించలేదు . అసలు కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు వెళ్లరు అనేదే ఆ ప్రశ్న. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభకు రాని కేసీఆర్ రాజీనామా చేయాలి అంటూ వరుస ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్న వేళ.. ఆయన నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంపై అందరి దృష్టి పడింది. కానీ అక్కడ కూడా రేవంత్‌ను బూతుల రాయుడు అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారే తప్ప, తాను సభకు హాజరుకాకపోవడానికి గల అసలు కారణాలను చెప్పడంలో కేసీఆర్ మళ్లీ విఫలమయ్యారు. త్వరలోనే పాదయాత్ర చేస్తానని ప్రకటించడం ద్వారా తనకు ఆరోగ్య సమస్యలేవీ లేవనే స్పష్టతనిచ్చిన కేసీఆర్, అసెంబ్లీ దాకా అడుగులు పడకపోవడానికి గల సమీకరణాలను మాత్రం గోప్యంగానే ఉంచారు.కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడానికి ప్రధాన కారణం ఆయన భావించే రాజకీయ స్థాయి . దశాబ్దకాలం పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన తనకు, తానెంతో తేలికగా తీసిపారేసిన రేవంత్ రెడ్డి సభానాయకుడి హోదాలో బెంచీపై కూర్చోవడం కేసీఆర్ మనస్తత్వం అంగీకరించడం లేదనేది బహిరంగ రహస్యం. తనకంటే వయస్సులో, రాజకీయ అనుభవంలో చిన్నవాడైన రేవంత్ ముందు తాను ప్రతిపక్ష నేతగా మైక్ కోసం నిలబడటాన్ని తన స్థాయికి తక్కువగా ఆయన భావిస్తున్నారని భావిస్తున్నారు. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ స్థాయిలు అనేవి స్వయంకృతాపరాధాలు కావు, ప్రజలు తీర్పు ద్వారా కట్టబెట్టే పదవులు మాత్రమే అనే కనీస సత్యాన్ని గులాబీ అధినేత విస్మరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.సభకు వెళ్తే రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ మంత్రులు తనను వ్యక్తిగతంగా అవమానిస్తారనే భయం కేసీఆర్‌కు ఉందనుకోవడం కూడా పొరపాటే. ఒకవేళ ప్రతిపక్ష నేత స్థాయి వ్యక్తిని సభలో అధికార పక్షం అనుచితంగా అవమానిస్తే, అది రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెట్టి కేసీఆర్‌కే మేలు చేస్తుంది. పైగా కేసీఆర్ సభకు వస్తే పూర్తి స్థాయి గౌరవం ఇస్తాం అని రేవంత్ రెడ్డి స్వయంగా ఒకటిరెండు సార్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి తనకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదనే సాంకేతిక కారణాన్ని చూపి సభను బహిష్కరిస్తున్నారు. కానీ కేసీఆర్‌కు ఆ సమస్య లేదు. ఆయనను అసెంబ్లీ రికార్డులు అధికారిక ప్రతిపక్ష నేత గా గుర్తించాయి, ఆ పదవికి ఉండే క్యాబినెట్ హోదా, సదుపాయాలు కూడా ఆయన ఖాతాలోనే ఉన్నాయి. ఇన్ని అనుకూలతలు ఉండి కూడా కారణం చెప్పకుండా సభకు దూరంగా ఉండటం తీవ్ర అస్పష్టతకు దారితీస్తోంది.బీఆర్ఎస్ నాయకత్వం కేసీఆర్ సభకు వస్తే రేవంత్ తట్టుకోలేడు అంటూ పైపైన చేసే వ్యాఖ్యలు కేవలం కేడర్‌లో ధైర్యాన్ని నింపేందుకు ఉపయోగపడతాయే తప్ప, సాధారణ ఓటరును మెప్పించలేవు. శాసనసభ అనేది ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అత్యున్నత వేదిక. అటువంటి వేదికను వదిలేసి, రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేత బాధ్యతను పక్కనబెట్టి ఇతర రాజకీయాలు చేయడం సభా బాధ్యతల నుంచి పారిపోతున్నారనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. తాను పాల్గొనని సభకు ప్రతిపక్ష నేతగా కొనసాగడం కంటే, ఆ బాధ్యతలను సభకు క్రమం తప్పకుండా వచ్చే కెటిఆర్ లేదా హరీష్ రావు లాంటి క్రియాశీల నేతలకు అప్పగించి ఉంటే బాధ్యతాయుతంగా ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మొత్తానికి, కేసీఆర్ అనుసరిస్తున్న ఈ సైలెంట్ బాయ్‌కాట్ వ్యూహం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పెద్ద ఆయుధంగా మారింది. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను గౌరవించని నేత అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం రోజురోజుకూ బలాన్ని పుంజుకుంటోంది. డీఎస్సీ, రైతు రుణమాఫీ, కాళేశ్వరం లాంటి కీలక అంశాలపై సభలో నేరుగా ముఖ్యమంత్రితో తలపడి ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ, కేవలం వ్యక్తిగత పట్టింపుల వల్ల ఆ అవకాశాన్ని బీఆర్ఎస్ చేజార్చుకుంటోందని అనుకోవచ్చు.

# మజ్లీస్ తో రేవంత్ సంబంధం...



హైదరాబాద్, సెప్టెంబర్ 7,తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. “రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను” అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది.అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. “నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు” అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్-ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140